# 1.

# ప్రారంభ సందేశం

భారతావని గురుశిష్యభావముడిగె
సత్యసంపద క్రమచర్య సన్నగిల్లె
భక్తి విశ్వాసములయందు రక్తి తొలగె
బాధ్యతలు లేని స్వాతంత్ర్య పరత హెచ్చె.

**పరమపావనమైన భారతావనియందు**
**సహనమన్నదెమనకు చక్కదనము**
**వ్రతములన్నింటియందు వన్నెగాంచినయట్టి**
**ఘనసత్యశీలమే కఠిన తపము**
**మధురభావంబేది మన దేశమందన్న**
**మాతృభావముకంటె మాన్యమెద్ది**
**ప్రాణంబుకంటెను మానంబె ఘనమను**
**మనదేశ నీతిని మంట గలిపి**
**నేటికిచ్చిరి పరదేశనీతులరసి**
**వెసవిచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి**
**ఔర! ఏమందు భారత పాలనంబు**
**ఏనుగెట్టుల తనబలమెరుగలేదొ**
**అట్టులైనారు భారతీయులు నేడు.**

పవిత్రాత్మస్వరూపులైన విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

srisathyasaivachanamrutam

పవిత్రమైన మన భారతదేశమందు విశిష్టమైన విద్యాసంస్థను మనము అభివృద్ధి గాంచుకునే నిమిత్తమై అనేకరకములైన మార్గములు అవలంబిస్తూ యిందులో సత్యనిత్యములు ఏమిటో అనే విచారణ చేసుకోలేనటువంటి పరిస్థితి యందుంటున్నాము. నాగలిని పట్టిన రైతు, యంత్రశాలయందున్న కార్మికుడు, బజారునందున్న వర్తకుడు, కవి, రవి ఒకరేమిటి ఈ జగత్తునందు జన్మించిన ప్రతి భారతీయుడు కూడను ఈ విశ్వపాఠశాలయందు విద్యార్థులే. అయితే తరగతులు వేరువేరుగా ఉంటున్నాయి.

**దుఃఖ నివృత్తి – ఆనంద ప్రాప్తి**

ఈ జగత్తునందు ఏదికూడను వృథా అయినది కాదు. అట్టి స్థితియందు మానవునియొక్క జీవితమును వృథాగా గడుపుకోవటము కేవలము మనయొక్క కర్తవ్యమునకు విరుద్ధమైనది. మతములుగాని, కులములుగాని మానవ కల్పితములే. ఒక్కొక్క పల్లెను రెండుగా మనము విభజిస్తున్నాము. ఒక్కొక్క పట్టణమును రెండు రెండు పట్టణాలుగా మనము విభజిస్తున్నాము. పల్లెలయందు ధనవంతుల పల్లె, ధనహీనుల పల్లె, పట్టణము నందు old town, new town అనే రీతిగా మనము వ్యవహరిస్తున్నాము. అయితే, అందరికి కూడను ఆనందమే లక్ష్యమనే విషయము మరచిపోతున్నాము. ఈ ఆనందము లక్ష్యమైన సమయము నందు, ఈ ఆనందము, సత్యము, త్యాగము ఈ మూడు కూడను కేవలము దైవము యొక్క ధనాగారములు. ఈ ఆనందమును మనము అనుభవించుకునే నిమిత్తమై మానవునికి, మానవునికి మధ్యనున్న సన్నిహిత సంబంధాన్ని చక్కగా అర్థము చేసుకున్న సమయమునందే ఇట్టి ఆనందము అనుభవించుకోవడానికి మనకు అవకాశము ఏర్పడుతుంది. అయితే, ఆనందము అంటే ఏమిటి? దుఃఖము లేకుండా వుండటమే ఆనందము. దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి మానవునకు ప్రధానమైన యుక్తి. ఇలాంటి యుక్తి మనకు ఏరీతిగా లభిస్తుంది అనేదానిని మనము విచారణ చేయాలి. నక్షత్రమునకు నక్షత్రమునకు మధ్యలో గ్రహమునకు, గ్రహమునకు మధ్యలో వెలుతురు ప్రకాశిస్తూ ఉంటుంది. అదేవిధముగా మానవునకు సుఖదుఃఖముల మధ్య లోపల ఆనందమనేది ప్రసరించక తప్పదు. మానవత్వములోనున్న విశిష్టతను మనము గుర్తించేలోపల కొన్ని రకములైన అంతరార్థములను విచారణ సల్పాలి. మానవుడు తనను తాను ప్రేమించుకునే నిమిత్తమై చేసే ప్రయత్నములందు యితరులను ప్రేమించక తప్పదు. ఇతరులను మనం

sri sathyasai vachanamrutam

ప్రేమించక మనపైన మనప్రేమ ఏనాటికీ అభివృద్ధి గాంచదు. దుఃఖమునకు ఫలితము దుఃఖమే. హింసకు ఫలితము హింసయే. కనుకనే మానవునియొక్క ఆనందమునకు మరొకరి ఆనందమే కారణం. కనుక పరులను ప్రేమించినప్పుడే మనయొక్క ప్రేమ స్పష్టముగా గోచరమవుతుంది. పరులను మానవులుగా మనము విశ్వసించినప్పుడే మనయొక్క మానవత్వము చక్కగా స్పష్టముగా గోచరమవుతుంది. కనుక, పరులయొక్క సుఖము, పరులయొక్క ఆనందము, పరులయొక్క సౌభాగ్యము, సంతోషమే మన సుఖ సంతోష సౌభాగ్యములుగా విశ్వసించటానికి మొట్టమొదట మనం పూనుకోవాలి. జీవితములో మరణమున్నది. ప్రేమలో దుఃఖమున్నది. పగటిలో రాత్రి ఉన్నది. అయితే యిట్టి రెండింటికిని భేదములు, విరుద్ధమైన భావములు మన కల్పనా లేక సృష్టి యొక్క నైజమా అని మనము చక్కగా విచారణచేసినప్పుడు ఏఏ ప్రేమలు, ఏ విరుద్ధములు, ఏ జనన మరణములున్నవో వాటికి అవియే విరుద్ధమైన పరిణామములు పొందుతుంటాయి. అది సృష్టియొక్క నైజము. ఇనుము చూచుటకు నల్లగాను, గట్టిగానూ ఉంటుంది. కాని అగ్నిలో ప్రవేశపెట్టినప్పుడు ఎఱ్ఱగాను, మెత్తగాను మారిపోతున్నాది. కనుక ఈ నల్లదనము, గట్టిదనమునకున్న విరుద్ధమైన ఎఱ్ఱదనము, మెత్తదనము రావటానికి పరిణామము ఎక్కడ వున్నదనగా మనయొక్క సంస్కారముతోనే పరిణామములు ప్రాప్తిస్తున్నాయి. ఇట్టి సత్యాన్ని మనము గుర్తించుకునే నిమిత్తమై చక్కని అభ్యాసములు, చక్కని సంబంధములు, పెద్దలయొక్క అనుభూతులు కొంతవరకు అనుసరించవలసిన ప్రయత్నములో మనము పాల్గొనాలి. అనాదికాలమునుండి మన భారతదేశము పవిత్రమైన ఆధ్యాత్మిక రంగమునందు గురుశిష్యుల సాంప్రదాయముగా కొనసాగుతూ వస్తున్నాది.

**విద్యావిధానంలో నైతిక, ధార్మిక ఆధ్యాత్మిక విద్యాప్రబోధలు**

వసిష్ఠులవంటి గురువు – శ్రీరామచంద్రునివంటి శిష్యుడు, సాందీపని వంటి గురువు – కృష్ణబలరాములవంటి శిష్యులు, గోవిందభగవత్పాదుల వంటి గురువు శంకరభగవత్పాదులవంటి శిష్యుడు, శుక మహర్షివంటి గురువు –పరీక్షిత్ మహారాజు వంటి శిష్యుడు, యిలాంటి గురుశిష్య సంప్రదాయము అనాదికాలము నుండి రావటంచేతనే పవిత్రమైన మన భారతీయ సంస్కృతి ఆనాటికి, నేటికి, ఏనాటికైనా కూడను

srisathyasaivachanamrutam

దేదీప్యమానంగా వెలుగుతూ వచ్చింది. కాని ఈనాడు అట్టి గురువులు, అట్టి శిష్యులు ఏరి? చెప్పటానికి వీలులేని పరిస్థితిని మనము అభివృద్ధి పరచుకుంటున్నాము. ఇట్టి గురుశిష్య సాంప్రదాయమును చక్కనైన హృదయముతో మనము అందుకున్నప్పుడే, పరిశుద్ధమైన భావముతో మనము స్వాగతము చేసినప్పుడే, నిర్మలమైన చిత్తముతో దానిని విశ్వసించినప్పుడే సత్యమైన నిత్యమైన ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. ఇట్టి సత్యాన్ని గుర్తించటానికి, మొట్టమొదట మనయొక్క తత్వాన్ని కూడను అర్థము చేసుకోక తప్పదు. మానవునికి మానవునికి మధ్యనున్న సంబంధం అర్థంచేసుకున్నప్పుడే నరనారాయణులకుగాని, మానవ మాధవులకుగాని, జనజనార్ధనులకు గాని మధ్యనున్న పవిత్రత కూడాను మనము కొంతవరకు గుర్తించుకోవటానికి వీలవుతుంది. ఈనాడు విద్యావిధానమునందు విద్యపేరుతో వికారమైన భావములు విజృంభించి తల్లిదండ్రులను తల ఎత్తుకొని తిరగలేని పరిస్థితికి తెప్పిస్తున్నాయి. ఇందులో త్యాగము, సహనము, సత్యము, ఈ శీలతత్వముతో కూడిన భావములు చేరినప్పుడే, విద్యకు చక్కని విలువ అందుకోవటానికి వీలవుతుందిగాని, ఈ త్యాగప్రేమ, సత్య, సత్శీలముల యొక్క భావములు గుర్తించుకోలేని విద్యార్థులకు విద్య విలువ ఏమాత్రము తెలుసుకోవటానికి వీలు కాదనే చెప్పవచ్చు.

**జనరల్ నాలెడ్జ్ ప్రధానం**

విద్య అనగా కేవలము బహుళ గ్రంథ పరిచయము కానేరదు. ఈ గ్రంథ పరిచయము కేవలము కొన్ని విధములైన ఊహలను మాత్రమే అభివృద్ధిపరుస్తుందిగాని గుణములను అభివృద్ధిపరచటానికి ఏమాత్రము కూడను పూనుకోదు. కనుకనే మానసిక స్వరూప స్వభావములుగాని, దేహము యొక్క స్వభావ స్వరూపములుగాని చక్కగా గుర్తించి వర్తించే ప్రయత్నానికి పూనుకునే ప్రకాశవంతమైన బుద్ధియొక్క లక్షణమే విద్యకు సరియైన అర్థము. విద్యార్థులయందు బాధ్యతాయుతమైన శక్తి అభివృద్ధిపరుచుకోవాలి. విద్యార్థులు కేవలము తమ విద్యయందు మాత్రమే కాకుండా, తమయొక్క భవిష్యత్తు జీవితముగాని, సమాజ ఉన్నతస్థితిని గాని కొంతవరకు లక్ష్యమందుంచుకోవాలి. కనుక, ప్రధానంగా మూడు శక్తులు వారియందుండాలి. Discipline, Devotion, Duty. ఈ మూడింటియొక్క తత్వముతోనే విద్యార్థి

sri sathyasai vachanamrutam

సమాజసేవ చేయటానికి కంకణము కట్టుకోవటానికి కొంత అర్హుడౌతాడు. ఈనాడు ఈ పవిత్రమైనటువంటి స్వరూపములను, త్రిగుణాత్మక స్వరూపములను దూరముపెట్టి, కేవలం M.Sc., M.A., అనే హయ్యర్ డిగ్రీలకు ప్రాకులాడుతున్నాడు. కాని, హయ్యర్ నాలెడ్జికి పోవటం చేత general knowledge పూర్తిగా నశించిపోతున్నది.

General knowledge లేకపోతే ఎంతటి విద్యావంతుడైనా కూడను కేవలము బలహీనునితోనే సమానము. ఎంత విద్యావంతుడైనప్పటికిని వాడు కేవలము అల్పునితోనే సమానము. ఆంగ్ల విద్యాభిమానులే అభివృద్ధి అవుతున్నారు గాని, ఆత్మవిద్యాభివృద్ధికి ఏమాత్రం పూనుకోవటం లేదు. ఆత్మ విద్యాభిమానము లేకున్న ఆంగ్లవిద్య మనకు కేవలము బానిసత్వమునే అందిస్తుందిగాని, భగవత్ తత్త్వాన్ని యేమాత్రము అందించదు. కనిపెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను గౌరవించే general knowledge ఈనాడు పూర్తిగా కోల్పోతున్నారు. ఎవరైనా ఇంటికి పెద్దలు వస్తే వారిని ఏరీతిగా ఆహ్వానించాలి అనే general knowledge పూర్తిగా శూన్యమైపోతున్నాది. ఎక్కడికైనా వెడితే ఏ డ్రస్సు వేసుకోవాలి, ఏరీతిగా మెలగాలి అనే నిత్యజీవితములో క్షణక్షణము అనుభవించవలసిన general knowledge ని ఈనాడు పూర్తిగా కోల్పోతున్నారు. పెద్దల దగ్గర ఏరీతిగా సంభాషించాలి అనే పలుకుల యొక్క పవిత్రత ఈనాడు కోల్పోతున్నారు. General knowledge లేనివారు విద్యార్థులౌతారో, విద్యాహీనులౌతారో చెప్పుకోటానికి సిగ్గుగా ఉంటుంది. ఈనాడు నీవు పెద్దలను గౌరవించినప్పుడే, ఈనాడు పెద్దలను వినయ భయవిశ్వాసములతో పలుకరించినప్పుడే, ఈనాడు తల్లిదండ్రులను గౌరవించినప్పుడే భవిష్యత్తులో అట్టి గౌరవము, అట్టి మర్యాదలు, అట్టి ఘన స్థానములు నీకు ప్రాప్తిస్తాయి. ఈనాడు నీవు అట్టి పవిత్రమైన మార్గమునందు ప్రవేశించకున్న భవిష్యత్తులో అట్టి ఘనతను ఏమాత్రము అందుకోటానికి అర్హత లేనటువంటి స్థితిలో అవస్థలు పడవలసి వస్తుంది. మానవుడు "నేను" అనే ప్రదేశము నుండి "మనము" అనే ప్రదేశమునకు సల్పునటువంటి ప్రయాణమే ఈ జీవితము. కనుక, ఎవరికి వారు oneway traffic మాదిరి పోవటము, మనలను మాత్రమే గౌరవించాలని కోరుకోవటంలోపల ఈ మానవత్వములో యేమాత్రము ఆనందము లభించదు. మనము గౌరవించాలి, గౌరవాన్ని అందుకోవాలి. ఆనందమును అందించాలి, ఆనందమును అందుకోవాలి. ఇది కేవలము give and take గా వుంటుంది గాని one way traffic గా వుండకూడదు.



sri sathyasaivachanamrutam

దివ్యాత్మస్వరూపులైన విద్యార్థులారా! మానవుడు కేవలము నీటిపైన వేసిన తైలపు బొట్టువలె ఏకాకిగా జీవించటానికి వీలుకాదు. వ్యక్తి యొక్క ఆనందమంతాకూడను సమాజము యొక్క ఆనందముపైన, సమాజము యొక్క ఆనందము విశ్వము యొక్క ఆనందముపైన ఆధారపడి వుంటున్నది. వ్యక్తి, సమాజ, విశ్వానందములను మనము హృదయానందముతో అనుభవించుకోవటానికి పూనుకున్నప్పుడు దివ్యత్వమైన ఆత్మప్రబోధలు మనకు కొంతవరకు అర్థమవుతాయి. విద్యార్థి విద్యార్థినిలు పెడమార్గము పట్టటానికి, ఈ విద్యావిధానము మూల కారణముగా వుంటున్నది. విద్యావిధానములో కొంతమార్పు కలిగినప్పుడే విద్యార్థుల యొక్క దోషాన్ని నివారించే ప్రయత్నము సలపవచ్చును. కేవలము భౌతికము, లౌకికము అయిన విద్యా ప్రబోధలు మానవుని అధోగతికి కొనిపోతున్నవి. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విద్యాప్రబోధలు అభివృద్ధి అయినప్పుడే విద్యావిధానములో కొంత ప్రశాంతి ఏర్పడుతుందని నా విశ్వాసము.

## అన్నిమతముల సారము ఆత్మశుద్ధియే

దయ, ప్రేమ అనేవి పూర్తి కోల్పోవటానికి, ఈ ధార్మిక ఆధ్యాత్మిక భావములు వారికి ఏమాత్రము తెలియకుండాపోవటమే కారణము. ఆత్మ విశ్వాసమును అభివృద్ధిపరచుకొని తదుపరి ఆనందమును అనుభవించి త్యాగమునకు పూనుకొని, సాక్షాత్కారము అనేటువంటి సన్నిధిని చేరే ప్రయత్నానికి ప్రతి యువకుడు ప్రయత్నము సల్పాలి. అన్ని మతములసారము ఆత్మశుద్ధిని మాత్రమే బోధిస్తున్నది. కనుక ఏ మతమును మనము ద్వేషించక, ఏ కులమును వేరు భావముతో భావించక సర్వమతములయొక్క సారముగాని, సర్వ కులముల యొక్క గమ్యముగాని, సర్వశాస్త్రములయొక్క సంబంధముగాని, ఏకత్వమైన సత్య స్వరూపకంగానే మనము విశ్వసించటానికి పూనుకున్నప్పుడే మన విద్యా విధానాన్ని అర్థము చేసుకున్నవారమవుతాము. ఈ ఒక్కనెల అనేకమంది అనుభవజ్ఞులైన పెద్దలు, అనేకరకములైన మతముల యొక్క సంబంధమును, అనుభూతులను అందుకున్న పవిత్ర జీవులయొక్క చరిత్రలుగాని, భారతదేశ సంస్కృతికి పవిత్రబలమును అందించిన మహాపురుషులయొక్క పవిత్ర భావములుగాని అందించేవారు అనేకమంది వస్తున్నారు. ఇలాంటి అవకాశమును సద్వినియోగము చేసుకొని, **చెప్పేటువంటి రత్నములైన వాక్యములను మీ హృదయ స్థానమందు భద్రపరచుకొని భావిభారతోద్ధారకులుగా మీరు**



sri sathyasai vachanamrutam

**తయారై భారతదేశముయొక్క పవిత్ర సంస్కృతిని మీరు పునరుద్ధరించటానికి తగిన కంకణము కట్టుకుంటారనే వుద్దేశ్యముతో ఈ summer classes మేము ప్రారంభిస్తున్నాము. ఇందులో పాల్గొనేవారు మహా అదృష్టవంతులనే చెప్పవచ్చును.** ఈ అదృష్టవంతమైన కాలమును అపవిత్ర పరచుకోకుండా కొంత సద్వినియోగపరచి విన్నటువంటివి, అనుభవించిన అనుభూతులను భవిష్యత్తులో జీవితమందు నిత్య ఆచరణలో పెట్టి యితరులకు మీరు అందించే ప్రయత్నములో పూనుకుంటారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 21-05-1973 న ఉదయం బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam